## క్లుప్తంగా

### కల్వర్టు పనుల పరిశీలన



16వ వార్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని 16వ వార్డు కురువ కమ్యూనిటీ హాల్ వద్ద వంకపై నిర్మిస్తున్న బాక్స్ కల్వర్ట్ పనులను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం శక్తినగర్‌లోని 13వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ విక్టర్ తదితరులు ఉన్నారు.

### కార్యకర్తకు పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీమోహన్ రెడ్డి

**కోసిగి:** మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన గుడికల్లు గోవిందు అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదోని మధు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి ఆదోనికి వెళ్లి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గుడికల్లు గోవిందును పరమర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితులను డాక్టర్ మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

### బాణసంచా సీజ్

**వెల్దుర్తి(కృష్ణగిరి):** వెల్దుర్తి బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని సుధా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను శుక్రవారం సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు రూ.15 వేలు విలువ చేసే బాణసంచాను గోదాములో ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. స్టాకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా బాణసంచా కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రమణీయం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

**ఆలూరు:** మండలంలోని కాత్రికి గ్రామంలో రంగనాథస్వామి, వేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వేద పండితుడు విష్ణుశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చకులు, గంగపూజ, కుంకుమార్చన, ఫల, పుష్ప సమర్పణ, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సమూర్తులను మేళతాళాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, పాలక కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో గ్రామంలోని ఎదురు బసన్న గుడి వరకు భాజాభజంత్రీలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, డోన్, బళ్లారి, శిరుగుప్ప, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రమేష్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగస్వామి, లక్ష్మిరెడ్డి, గోవిందు, ఈరన్న, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, ఆలూరు ఎంపీపీ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు ఎస్ఐ ఓబులేశు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

### విత్తన దుకాణాల తనిఖీ

**కోడుమూరు రూరల్:** మండల కేంద్రం కోడుమూరులోని విత్తన దుకాణాలను ఏఓ రవి ప్రకాష్ శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు కూడా వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా దుకాణాల్లో ఐదు కంపెనీలకు చెందిన విత్తనాలను ఏఓ సేకరించి పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- మెయిన్ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా
- పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయండి
- మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు
- ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

**ఆదోని రూరల్:** వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన రోడ్డు సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. పట్టణంలో కొత్త బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కొత్త బస్టాండు సమీపంలో రోడ్డుపై పశువులు ఎక్కువగా ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పశువుల యజమానులు తమ పశువులను తీసుకెళ్లాలని, లేనిపక్షంలో గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. పెద్దమార్కెట్ ఏరియాలో పార్కింగ్ సమస్య ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మెయిన్ రోడ్లపై గుంతలు ఉంటే పూడ్చి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో పిల్లలను తరలిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆ ప్రదేశంలో ఎలంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీ నాగేంద్ర, ఎంవీఐ సిసిరాదీప్తి, రోడ్లు భవనాల శాఖ ఈఈ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ వెంకటప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సీఐ మంజునాథ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

- ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ

**ఎమ్మిగనూరుటౌన్:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇక మిగిలింది రెండు రోజుల సమయమే మిగిలిఉండడంతో ఉత్కంఠ పెరిగిపోతుంది. ఎటు చూసినా ఓటింగ్, కౌంటింగ్‌పై చర్చ, విశ్లేషణలు, ఏ ఇద్దరు కలిసినా విజయం ఏ అభ్యర్థికి వర్తిస్తుందనే అంశంపైనే చర్చించుకుంటున్నారు. 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయం సాధించేది ఎవరన్నది నియోజకవర్గ ప్రజల్లో ఉత్కంఠభరితంగా మారింది. ఓట్ల లెక్కింపులో 14 టేబుళ్లు, 20 రౌండ్లు ఉండటంతో ఏ రౌండ్‌కు ఏ గ్రామం వస్తుంది అందులో తమ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందోనంటూ లెక్కలేసుకుంటూ విజయావకాశాలపై ఆయా పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 271 పోలింగ్ బూత్‌లుండగా ఏ బూత్‌లో ఎవరికి ఎంత మెజారిటీ వస్తుందో అని లెక్కలేసుకొంటున్నారు. గ్రామాల్లోనూ, పట్టణంలోని వార్డుల్లో తమ నేతకు ఇంత మెజారిటీ, అంత ఆధిక్యం వస్తుందని చర్చించుకుంటూ గత ఎన్నికల మెజారిటీ, ఇప్పటి ఎన్నికల మెజారిటీపై బేరీజు వేసుకుంటూ కౌంటింగ్ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొందరు తమ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తూ బెట్టింగ్ సైతం వేస్తుండడం గమనార్హం.

**గెలుపుపై ధీమాలో వైఎస్సార్‌సీపీ**

అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అందించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయడంతో ప్రజలు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి బలపరిచిన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుకకు ఈ ఎన్నికల్లో జై కొట్టారని పార్టీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్నింటా విఫలమైన కూటమి అభ్యర్థి బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి వైపు ప్రజలు మొగ్గు చూపలేదని, ఇక చేనేత పురిలో చేనేత కుటుంబానికి చెందిన బుట్టా రేణుక గెలుపు, భారీ మెజారిటీ ఖాయం అని పేర్కొంటున్నారు.

# కౌంటింగ్ వేళ సంయమనంతో ఉండాలి




హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

**కౌతాళం:** ఓట్ల లెక్కింపు సమయంలో నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండాలని కోసిగి సీఐ ప్రసాద్ కోరారు. స్థానిక పోలీస్టేషన్‌లో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలందరూ ప్రశాంతంగా ఉంటూ పూర్తి సహకారం అందించారని అలాగే కౌంటింగ్ వేళ శాంతియుతంగా ఉండాలని కోరారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గొడవలు చేయడం, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటివి చేయరాదన్నారు. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అలాగే 144 సీఆర్పీసీ, 30వ పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. సోషల్ మీడియా గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సర్పంచ్ పాల్‌దినకర్, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, మండల కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి



డిప్యూటీ ఈఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లను నిలిపి వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఆఖండ డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ ఈఓ కార్యాలయం అధికారి చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. అకాడమిక్ ఇయర్ ప్రారంభం గాకముందే అడ్మిషన్లు చేసుకోవడం సరికాదన్నారు. కొన్ని పాఠశాలల్లో రంగురంగుల బ్రోచర్లు, ర్యాంకుల కరపత్రాలతో విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారన్నారు. ధనార్జనే ధ్యేయంగా పేద విద్యార్థులతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మహేష్, రసూల్, వీరేష్, సునీల్, సంతోష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరుటౌన్:** విద్యాశాఖ అనుమతుల్లేకుండా పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న శ్రీ సర్వజ్ఞ కిడ్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఆర్‌యూఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు సురేష్, రఘునాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. విద్యాశాఖ అనుమతుల్లేకుండా అడ్మిషన్లు చేపడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విద్యార్థి సంఘాల నాయకులు రవికుమార్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

### క్యాన్సర్ నివారణపై అవగాహన

**ఆదోని టౌన్:** ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్యాన్సర్ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్లు ఏడుగురు కార్యక్రమంలో పాల్గొన్నారు. జనరల్ ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన గావించి సదస్సును ప్రారంభించారు. ఏడుగురు మెడికల్ కాలేజీ డాక్టర్ల బృందం పాల్గొని కేన్సర్ వ్యాధి నివారణ చర్యలను వివరించారు. డాక్టర్లు శ్రీనివాసనాయక్, వాణిశ్రీ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహాలను తొలగించాలని డాక్టర్లకు సూచించారు. నివారణ చర్యలతో వ్యాధిని నయం చేసుకునే అవకాశం కూడా ఉందని వివరించారు.

### జంపాపురం విద్యార్థుల ప్రతిభ

**కోసిగి:** మండల పరిధిలోని జంపాపురం గ్రామం నుంచి 12 మంది గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (ఎస్సీ) గురుకుల, జ్యోతీరావు పూలే (బీసీ) గురుకుల, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ (ఏపీఆర్ఎస్) గురుకుల పాఠశాలలకు ఎంపికై సత్తాచాటారు. గ్రామానికి చెందిన రాకేష్‌కుమార్ 87 మార్కులు సాధించి పత్తికొండ ఏపీఆర్ఎస్‌కు, అఖిల 84 మార్కులతో ఏపీఆర్ఎస్ బనవాసి స్కూల్‌కు ఎంపికయ్యారు. అలాగే బీసీ గురుకులంకు అరవింద్ 45 మార్కులు, మల్లికార్జున 44 మార్కులు, శివసాయి 44 మార్కులు, విష్ణుతేజ 44 మార్కులు, శ్రావణి 44 మార్కులు, రక్షిత 44 మార్కులు, నిక్షిత 42 మార్కులు సాధించి ఎంపికయ్యారు. అంబేడ్కర్ గురుకులంకు విష్ణువర్ధన్, అమృత ఎంపికయ్యారు. వీరికి గ్రామంలో సోమశేఖర్, హరి, శివనాగులు అనే ప్రైవేటు ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. గ్రామం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు గురుకులం ప్రవేశాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందిస్తూ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకం

**మద్దికెర:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంపకానికి పోత్సాహకాలు అందిస్తున్నాయని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకంలో 5 ఎకరాల్లోపు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్లతోటలు పెంచడం వల్ల మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు సైతం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యలత

**మంత్రాలయం:** కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ గత పదేళ్లుగా విధులకు హాజరుకాకుండా జీతం తీసుకుంటున్న ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు థామస్, రామకృష్ణనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచారణ నిమిత్తం వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యలతను వారు కలిసి ఫిర్యాదు చేశారు. దాదాపు పదేళ్ల పాటు విధులకు రాకుండా ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో పనిచేస్తూ వేలాది రూపాయలు ప్రభుత్వ జీతం కాజేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు నారాయణ, చిన్న రాజు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# రాయితీ విత్తనాలు రెడీ

- నేటి నుంచి వేరుశనగ కాయల పంపిణీ
- రైతులకు 40 శాతం సబ్సిడీతో అందజేత
- మండలానికి 275 క్వింటాళ్ల కేటాయింపు



రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనకాయలు

**గోనెగండ్ల:** మండలంలో రైతులు ఏటా ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుశనగను సాగుచేస్తుంటారు. ఈ సీజన్‌లో కూడా మొత్తం 16 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో వేరుశనగను సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో గత రబీ సీజన్‌లో పండించిన వేరుశనగ కాయలను రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేసింది. సేకరించిన కాయలను శుద్ధి చేసి రాయితీపై అన్నదాతలకు అందించేందుకు చర్యలు చేపట్టింది. మండల వ్యాప్తంగా ముందుగా 275 క్వింటాళ్ల వేరుశనగ కాయలను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. నేటి (శనివారం) నుంచి విత్తనాలను రైతులకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రంలో ముందుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**సబ్సిడీ ధరకే సరఫరా**

రైతులకు 40 శాతం రాయితీపై వేరుశనగ విత్తన కాయలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో కే6 రకం వేరుశనగ విత్తనకాయలు క్వింటాలు ధర రూ.9,500 కాగా 40 శాతం రాయితీ రూ.3,800 పోను రైతులకు రూ.5,700 కే అందించనున్నారు.

**పకడ్బందీగా పంపిణీ**



మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తన కాయలను శనివారం నుంచి పకడ్బందీగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను పంపిణీ చేశాం. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అందరికీ విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. అర్హులైన రైతులందరికీ విత్తనాలు అందిస్తాం. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– మహమ్మద్ ఖాద్రి, ఏడీఏ, ఎమ్మిగనూరు

# కౌంటింగ్‌కు కౌంట్ డౌన్

- 4న రాయలసీమ యునివర్సిటీలో ఓట్ల లెక్కింపు
- ఎమ్మిగనూరు ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, 20 రౌండ్‌లో తుది ఫలితం
- రిటర్నింగ్ అధికారి చిరంజీవి వెల్లడి



ఈవీఎంలను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

**ఎమ్మిగనూరుటౌన్:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఎమ్మిగనూరు అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో జరుగనుంది. నియోజకవర్గ పరిధిలో 2,47,752 మంది ఓటర్లుండగా గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 271 పోలింగ్ కేంద్రాల్లో 2,03,086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,01,914 మంది పురుషులు, 1,01,158 మంది మహిళలున్నారు. పోలైన ఓట్లను కౌంటింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన 14 టేబుళ్లలో 20 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు మొదట మూడు రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి తర్వాత ఈవీఎంలో మిగిలిన ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నారు. ఒక్కో కౌంటింగ్ టేబుల్‌కు సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, 17మంది మైక్రో అబ్జర్వర్ ఓట్ల లెక్కింపులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు

**ఇబ్రహీంపురం నుంచి మొదటి ఓట్ల లెక్కింపు ప్రారంభం**

నియోజకవర్గంలోని నందవరం మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామం పోలింగ్ బూత్ నెంబర్ 1 నుంచి ఈవీఎంల మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. చివరి రౌండ్ గోనెగండ్ల మండల పరిధిలోని 271వ పోలింగ్ బూత్ అయిన కుర్నూరు గ్రామంలో పోలైన ఓట్ల లెక్కింపు ముగియగానే విజేత ఎవరో అధికారికంగా తేలనుంది. ఇప్పటికే ఎమ్మెల్యే స్థానానికి పోటీలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియ సైతం ప్రారంభమైనట్లు అధికారులు పేర్కొన్నారు.

**పకడ్బందీగా ఓట్ల లెక్కింపు**



ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో 4వ ఫ్లోర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగింది. కౌంటింగ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశాం. 20వ రౌండ్ తర్వాత తుదిఫలితం వెల్లడికానుంది.

– చిరంజీవి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎమ్మిగనూరు

# సురక్షతో మెరుగైన ఆరోగ్య సేవలు



మాట్లాడుతున్న సర్పంచ్ పాల్‌దినకర్

**కౌతాళం:** ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి పావని అన్నారు. కౌతాళంలో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని స్థానిక సచివాలయం-3 పరిధిలో సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రోగులు అధికంగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హైపర్‌టెన్షన్, డయాబెటీస్, హిమోగ్లోబిన్, మలేరియా, టీబీ, డెంగ్యూ, యూరిన్ టెస్ట్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమాన్ని ఆరోగ్య సురక్ష ద్వారా చేపడుతున్నామని తెలిపారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రజారోగ్యం కోసం చేపట్టడం బాగుందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆయా కుటుంబాల వారికి ఏదైనా అనారోగ్యం వస్తే రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ ఏఓ సత్యన్న, కార్యదర్శి శివప్ప, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ధూమపానానికి దూరంగా ఉందాం



కోసిగిలో ధూమపానానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

**కోసిగి:** పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉందామని, సంపూర్ణ ఆరోగ్యం పొందుదామని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మనోజ్‌కుమార్, అభిరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లతో కలిసి పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువత పొగాకుకు బానిసై ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే పొగాకుకు అలవాటు పడితే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. పొగాకు అతిగా వినియోగించడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధి, గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. యువత పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల కలయిక

**పత్తికొండ రూరల్:** మండల పరిధిలోని హోసూరు జెడ్పీహైస్కూల్‌లో 2005–2006 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ నాటి గురువులను ఆహ్వానించి వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకమ్మ, ఈశ్వరప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



### గాయత్రీ మాతకు పూజలు

**ఆస్పరి:** మండలంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.